# ఆవు కథ

అందరిలా నానా గడ్డీ తినడం ఇష్టంలేక ఒక ఆవు అడవిలోకి వెళ్ళి స్వచ్ఛమైన పచ్చగడ్డి కడుపు నిండా తిని తిరిగి వస్తోంది.

మర్నాటికి మరికొంచెం గడ్డి మూట గట్టుకుని రాకుండా కడుపు నిండగానే ఇంటిముఖం పట్టిన ఆ ఆవుకి దారిలో పులి ఎదురైంది.

రాజులు, రాణులు, జమీందార్లు, దొరలు దొరల్లాంటి వాళ్ళు తుపాకీ వేట సరదావల్ల పులి జనాభా తక్కువైపోయి ఆ ప్రాంతాలో ఎప్పుడూ పులిని చూడని సదరు ఆవు ముందు ఆశ్చర్యపోయి ఆటు పిమ్మట భయపడసాగింది.

భయంతో వణికిపోతున్న ఆవుని చూసే పులికి జాలి వేసింది. "నువ్వలా రాజకీయ నాయకుడ్ని చూసిన సామాన్య మానవుడిలా భయపడకు. నిన్ను వాయిదా పద్ధతిపై ఐదేళ్ళకోసారి కొంచెం కొంచెం

## స్వాగతంబు

భోంచెయ్యను. ఒకే దెబ్బకి నిన్ను చంపి తినేస్తాను. భయపడకు" అని పులి ఆవుకి అభయం ఇచ్చింది.

ఆవు భయపడ్డం మానేసి చివరిసారిగా దేవుణ్ని ప్రార్థించసాగింది. గోదేవుడు కనిపించాడు. రెండు కొమ్ములు, నాలుగు కాళ్ళున్న గోదేవుడ్ని చూసేసరికి ఆవుకి పోతున్న ప్రాణం లేచొచ్చింది.

"ఆవా! ఏమి నీ కోరిక?" అనడిగాడు గోదేవుడు.

"ఒక్కటే ఒక్క కోరిక! ప్రాణభిక్ష పెట్టమని కోరుకోడంలేదు. ఇంటికొక్కసారి వెళ్ళి నా దూడకి పాలిచ్చి వచ్చేస్తాను" అని ఆవు వేడుకుంది.

"ఏమిటి నీ గొడవ?" అని పులి గర్జించింది

గోదేముడు భయపడి మాయమైపోయాడు. పులిని చూసి ఆవు మళ్ళీ భయపడ సాగింది.

"మధ్యంతర ఎన్నికలొస్తే ప్రజలు భయపడ్డట్టు మళ్ళీ నువ్వు భయపడతావెందుకు? ధైర్యంగా చచ్చిపో" అని పులి గర్జించింది.

"భయపడుతూ బతకడానికి నేనేం మనిషిననుకున్నావా? ధైర్యంగా పశువులాగే చచ్చిపోతాను. కానీ నాదో చిన్న కోరిక. నువ్వు మన్నిస్తే హాయిగా చచ్చిపోతాను" అంది ఆవు.

"ఏమిటా కోరిక తొందరగా చెప్పు నాకు ఆకలవుతోంది" అంది పులి.

"ఈ పాటికి నా దూడకి కూడా ఆకలవుతూ వుంటుంది. నేను పరిగెట్టుకుంటూ వెళ్ళి పాలిచ్చి వస్తాను నా మాట నమ్ము. నేను మనిషిని కాదు. పశువుని. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాను" అని ఆవు ప్రాధేయపడింది.

"నీ ఆవూ, దూడా కథలు విని మోసపోడానికి నేను మనిషిని కాను. పశువునే! కాబట్టి నీమీద జాలి వేస్తోంది. నిన్ను నమ్ముతున్నాను. అర్జంటుగా వెళ్ళి పాలిచ్చి వచ్చెయ్యి" అని పులి అంగీకరించింది.



మంత్రివర్గంనుంచి ఉద్వాసన వచ్చేలోగా ప్రారంభోత్సవాలకి మంత్రి పరుగెట్టి కెళ్ళినంత వేగంగా ఆవు అడవి దాటుకుని దూడని చేరుకుంది.

అన్నెం పున్నెం యెరుగని దూడ పవిత్రమైన ఓటరులాగ ఆకలితో నాయకుడికోసం యెదురు చూసినట్టు ఆవుకోసం యెదురు చూస్తోంది.

ఆవుని చూడగానే "జై" కొట్టినట్టు "అంబా" అంది దూడ. దూడ అమాయకత్వానికి నవ్వుకుని ఆవు కన్నీరు కార్చింది. కడుపు నిండా పాలిచ్చింది దూడ పాలు తాగుతున్నంతసేపు ప్రేమగా నాకుతూ "దూడమ్మా! దూడా! దేవుడి దయవల్ల మనం ఆవులై పుట్టాం. కుక్కలై పుట్టి మనుషులపట్ల విశ్వాసంగా వున్నా ఈ దేశంలో మానవుడు మనల్ని ఇంత పూజించడు. మన మలాన్ని కళ్ళకద్దుకోరు. మన మూత్రాన్ని తాగి నెత్తిమీద జల్లుకోరు. పొరపాటున గేదెలా పుట్టినా మన పాలు పూజకి పనికిరావంటారు. వచ్చే జన్మలో వాళ్ళ సౌకర్యార్థం మనల్ని ఈ జన్మలో నెత్తిమీద పెట్టుకుంటారు. కాబట్టి నీ జన్మ నువ్వు సార్థకం చేసుకో. ఏ ఆందోళనతో నువ్వేం చేసినా నిన్ను ఈ ప్రజలు పతివ్రతలా పవిత్రంగానే చూస్తారు. త్వరలో ఆవువై దూడల్తో వర్ధిల్లు. నేను అడవిలోకి వెళ్తున్నాను. అదృష్టం వుంటే తిరిగి వస్తాను లేకపోతే ఇంతే సంగతులు" అని కన్నీరు కారుస్తూ బయల్దేరింది ఆవు.

అన్నమాట ప్రకారం దూడకి పాలిచ్చి పులికి ప్రాణాలు ఇవ్వడానికి వచ్చిన ఆవుని చూసి పులి ఆశ్చర్యపోయింది.

"నీతి, నిజాయితీకోసం ప్రాణత్యాగం చెయ్యడానికి వచ్చిన నిన్ను పొట్టన పెట్టుకోడానికి నేను దయా దాక్షిణ్యాలు లేని మనిషిని కాను. ఆకలి తీర్చుకోడానికి చంపుతానన్నాను. నీ నిజాయితీకి మెచ్చుకుని వదిలేస్తున్నాను నిన్నుతింటే దేవుడు నన్ను యేమైనా చేస్తాడనే భయంవల్ల మాత్రం కాదు. హాయిగా వెళ్ళి చిక్కటి పాలిస్తూ చక్కగా బతుకు. నీళ్ళు కావాలంటే మనుషులే కలుపుకుంటారు." అని పులి ఆవుని ప్రాణాలతో వదిలేసింది.

ఆవు వూళ్ళోకి, పులి అడివిలోకి వెళ్ళిపోయాయి. కాని ఆవుని పులి తినేస్తుందేమోనని భయపడి పోలీసుల్ని పిల్చుకొచ్చిన ఒక "మానవుడు" పులిని పోలీసులకి చూపించాడు

పోలీసులు పులి చుట్టూ తుపాకుల్ని గురిపెట్టి "నువ్వు మామూలు క్రూరమృగానివి కాబట్టి,నిన్ను రక్షించాలి కాబట్టి ఈ సారికి క్షమించి వదిలేస్తున్నాం ఇంకెప్పుడూ పవిత్రమైన ఆవుని తింటానని అనకు. ఆవుని ఏమైనా చేస్తే నరకానికి పోగలవు. నీకు అంతగా ఆకలేస్తే ఇంకే జంతువునైనా తిను మాకు అభ్యంతరంలేదు వెళ్ళు! మళ్ళీ ఆవుకేసి కన్నెత్తి చూడకు" అని హెచ్చరించారు. పులి తోక ముడుచుకుని అడివిలోకి వెళ్ళిపోయింది.

[నీతి : ఆవులు, పులులు క్షేమంగా వుండడానికి ముందు ఏర్పాట్లు చెయ్యాలి మనుషుల సంగతి తర్వాత చూసుకోవచ్చు.]

—తంబు